'ఆంజనేయభక్తుల' బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు

రామంతాపూర్: చిన్న చెరువు ప్రాంగణంలోని పాండురంగ స్వామి దేవాలయం నుంచి శనివారం ఆంజనేయ స్వామి దీక్ష స్వాముల బైక్ ర్యాలీని శనివారం కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కక్కిరేణి చేతన హరీష్, సీనియర్ బీజేపీ నేత గడ్డం సాయి కిరణ్ ప్రారంభించారు. ర్యాలీ ఉప్పల్, హబ్సిగూడ రామంతాపూర్, డివిజన్‌ల పరిధిలోని వివిధ ఆంజనేయస్వామి దేవాలయాలకు చేరుకుని స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆగి లతారెడ్డి, ఆంజనేయ సేవా ట్రస్ట్ సభ్యులు వీరప్రకాష్, రాగి వెంకట్‌రెడ్డి, భాస్కర్, మహేష్‌గౌడ్, రవీందర్‌గౌడ్, లక్ష్మణ్, నరేష్‌గౌడ్, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌చారి, వెంకటేష్ చారి, ఆంజనేయులు చారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

మల్లాపూర్: విద్యాసంవత్సరానికి ముందే జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులు చేపట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) నేతలు అన్నారు. శనివారం మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఏఐవైఎఫ్, బాల సంఘం మేడ్చల్ జిల్లా సమితి నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలన్నారు. పాఠశాలలను సందర్శించిన వారిలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, గిరి బాబు, బాల సంఘం నేతలు మహేష్, కిరణ్, అజీమ్ తదితరులు ఉన్నారు.



సదుపాయాలను కల్పించాలని నినాదాలు చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

డయాగ్నోస్టిక్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖ దాడి



ఉప్పల్‌లోని ధనుంజయ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

నిబంధనలు పాటించని కేంద్రాలు సీజ్

ఉప్పల్: డయాగ్నోస్టిక్ సెంటర్‌లు, స్కానింగ్ కేంద్రాలు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి హెచ్చరించారు. గర్భనిర్ధారిత స్కాన్లు సరైన దస్తావేజులు లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ ప్రాథమిక వైద్యకేంద్రం పరిధిలోని పలు డయాగ్నోస్టిక్ సెంటర్‌లు, స్కానింగ్ కేంద్రాల్లో కీసర డివిజన్ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎస్.నారాయణరావుతోపాటు పలువురు వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని ధనుంజయ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను, అల్ట్రా సౌండ్ యంత్రాలను సీజ్ చేశారు.

'కళా సిల్క్' చేనేత ప్రదర్శన







చీరలను పరిశీలిస్తున్న వినియోగదారులు

అల్వాల్: నగర ప్రజలకు ఫ్యాషన్ వస్త్రాలను ఒకే వేదికపై అందించేందుకు కళాసిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో అల్వాల్ శ్రీసాయి గార్డెన్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కళా సిల్క్ వస్త్ర ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, ఉప్పాడ, బనారస్ సిల్క్, కశ్మీరీ సిల్క్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, బెంగాల్ కాటన్ శారీస్, జైపూర్ కుర్తీస్, కోటా శారీస్, లక్నో వర్క్ కుర్తీస్, హర్యానా బెడ్‌షీట్స్, హైదరాబాద్ మంచి ముత్యాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు వికాస్ జైన్ తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ఉప్పల్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మీర్‌పేట ఎక్స్‌టెన్షన్ నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా గవర్నర్ లయన్ వి.కృష్ణప్రసాద్ సమక్షంలో ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా వికాస్, కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా మహిపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యవర్గంతో పూర్వ గవర్నర్ బి.వెంకటేష్, బి.రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కళ్యాణపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న రోబోటిక్ బర్డ్స్ ఎగ్జిబిషన్



రోబోటిక్ బర్డ్స్ ఎగ్జిబిషన్ ఎంట్రన్స్



సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన రోబోటిక్స్ బర్డ్స్



మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ ఎదురుగా నిర్వహిస్తున్న రైడ్స్ టు ఫ్లై రోబోటిక్స్ బర్డ్స్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. రోబోటిక్ బర్డ్స్ మొదటిసారిగా ఈ ప్రదర్శనలో ఉంచామని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు సయ్యద్ సోహెల్ తెలిపారు. ఎగ్జిబిషన్‌లో అమూస్మెంట్, జాయింట్ వీల్ 24 సీట్లు, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ ట్రైన్, కొలంబస్, వాటర్ బెరడ్, బౌన్సర్, మినీట్రైన్, స్కార్పియో, రిమోట్ కార్, హెలికాప్టర్, ట్రాంప్లింగ్ జంపింగ్, స్కార్పియో రైడ్ వంటివి సందర్శకులకు ఆకట్టుకున్నాయి. సందర్శకుల షాపింగ్ కోసం జువెలరీ, కిడ్స్‌వేర్, జైపూర్ బ్యాంగిల్స్, బొమ్మలు, ఫుట్ వేర్, చైనా బజార్ వంటి స్టాల్స్ ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్ద వాళ్లు తినడానికి ఫుడ్‌కోర్ట్, చాట్ బండార్, ఢిల్లీ మిర్చి పాపడ్, ఐస్ క్రీమ్, చాక్లెట్ ఫౌంటెయిన్, స్మోక్ బిస్కెట్ వంటివి స్టాల్స్‌లో ఉంచారు. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నిధుల్లేక.. పనుల్లేక..!



- గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు.. మరమ్మతులకు ఆటంకం
- పారిశుద్ధ్య కార్మికులకూ ... నెలనెలా అందని జీతాలు
- చేతులెత్తేసిన స్పెషల్ ఆఫీసర్లు.. ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ఆగని అక్రమ నిర్మాణాలు... పన్నుల వసూళ్లలోనూ జాప్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామపంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. అభివృద్ధి పనులు, మరమ్మతులకు ఆటంకంగా మారుతోంది. సర్పంచుల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2తో ముగిసిపోగా... నాలుగు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. వీరి పాలనకు ముందే పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయి. సర్కారు నుంచి కొన్ని నెలలుగా నిధులు జమ కాకపోవటంతో పాలన మొక్కుబడిగా సాగుతోంది. రానున్న వర్షాకాలంలో నిధుల్లేక గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పడకేస్తే ప్రజలు రోగాల బారిన పడే అవకాశముంది.

చేతులెత్తేసిన ప్రత్యేకాధికారులు

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీకి మరమ్మతు, బోర్ల మరమ్మతు పనులు పంచాయతీ ట్రాక్టర్ నెలవారీ బ్యాంకు వాయిదా, గ్రామాల్లోలో విద్యుద్దీపాలు, నెలనెలా విద్యుత్ బకాయిలు.. ఇవ్వన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. ఈ బరువు బాధ్యతల నుంచి ప్రత్యేక అధికారులు చేతులెత్తేసే తరహాలో ఉండటంతో గ్రామ కార్యదర్శులే భుజాన వేసుకొని ... కొద్దో, గొప్పో కార్మికులకు సగం సగం జీతం సర్దుబాటు చేస్తున్నట్లు ఓ గ్రామ కార్యదర్శి ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికే కొన్ని గ్రామ పంచాయతీల్లో అప్పు చేసి ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగు రోజులు ఉండి పోయే వాళ్లమని ప్రత్యేక అధికారులు దాట వేస్తున్నారని పలువురు కార్యదర్శులు పేర్కొంటున్నారు.

ఖాతాలు ఖాళీ..

గ్రామ పంచాయతీకి మూడు రకాల ఖాతాలు ఉంటాయి. ఒకటి ఆస్తి పన్ను జమ చేసుకునే ఖాతా... గ్రామాల్లో ఆస్తి పన్ను వసూలు లక్ష్యానికి చేరుకొనకపోవటం.. ఖర్చులు మూడింతలు ఉండటంతో ఇది ఎప్పుడు ఖాళీగానే ఉంటుంది. రెండో ఖాతా ఎస్ఎఫ్సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు జమ చేస్తారు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. కానీ గత సర్కారు హయాంలో ఎస్ఎఫ్సీ నిధులు అరకొర మంజూరుతోనే సరిపెట్టింది. మూడో ఖాతా.. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇందులో జమ అవుతాయి. కేంద్ర సర్కారు నేరుగా పంచాయతీలకు గ్రామ జనాభా ప్రాతిపదికన జమ చేస్తుంది. ప్రతి నాలుగు నెలలకోసారి వీటిని అందజేస్తోంది. కేవలం ఈ నిధులు మాత్రమే పంచాయతీలకు అందుతుండటం.. వీటిని ప్రత్యేక పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు ఖర్చు చేయని నిధులు ఆయా ఖాతాల్లో మిగిలిపోగా మార్చిలో వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది.

పాలక వర్గం లేక...

గ్రామపంచాయతీల్లో ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ, పరిస్థితి ఎక్కడేసిన గొంగడి అక్కడనే చందంగా ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా జీతాలు అందటం లేదు. పంచాయతీల్లో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్టలేకుండా పోతోంది. ప్రభుత్వ, అసైన్డ్ భూములు, పార్కు స్థలాల్లో జోరుగా అక్రమ కట్టడాలు, లేఅవుట్లు కొనసాగుతున్నా... ప్రత్యేకాధికారులకు పట్టించుకోవటం లేదు. ఎన్నికల కోడ్ పేరుతో స్పెషల్ ఆఫీసర్లు విధులు నిర్వర్తించలేకపోతున్నారనే అపవాదును ఎదుర్కొంటున్నారు. పంచాయతీల్లో పన్నుల వసూళ్లలో కూడా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తోంది. నిర్మాణాల అనుమతుల విషయంలోనూ ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

మొక్కుబడి కూల్చివేతలు

జెడ్పీల్లో అక్రమ కట్టడాలపై చర్చ నేపథ్యంలో జిల్లా పంచాయతీ శాఖ మొక్కుబడి కూల్చివేతలకు తెరలేపింది. ఘట్కేసర్ ఎంపీపీసహా పలువురు సభ్యులు అక్రమ కట్టడాలపై ఆధారాల ప్రతులను చైర్మన్‌సహా అధికారులకు అందజేశారు. దీంతో పంచాయతీ శాఖ కూల్చివేతలకు ఉపక్రమించింది. ఇప్పటి వరకు చీర్యాల, చౌదరిగూడ, బొమ్మరాసిపేట ,శామీర్‌పేట ఆరేంజ్ బౌల్ వద్ద అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వస్తేనే పంచాయతీ శాఖ కూల్చివేతలకు దిగుతోంది. ఎన్నికల సమయంలో జీపీల్లో పదుల సంఖ్యలో ముఖ్యంగా ప్రభుత్వం, అసైన్డ్,పార్కుల స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినా ...సిబ్బంది పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: మల్లాపూర్ పారిశ్రామిక వాడలోని స్టాండర్డ్ టైల్స్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు,

- జోప్లో ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు,
- సాయి నగర్ ఫీడర్ పరిధిలో12.30 వరకు 2 గంటల వరకు,
- ఐడీఏ మల్లాపూర్ ఫీడర్ పరిధిలో 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

నాచారంలో...

- నాచారం 11 కేవీ ఇన్నోజెట్ ఫీడర్, గురు రాఘవేంద్రనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు,
- భాగ్యనగర్ ఫీడర్, మల్టీస్టీల్ ఫీడర్ పరిధిలో 3 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని నాచారం ఏఈ నాగరాజు తెలిపారు.

ఉప్పల్ సర్కిల్ సీపీఎం కార్యదర్శిగా వెంకన్న



వెంకన్న

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ సీపీఎం కార్యదర్శిగా జె.వెంకన్న ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నర్సింహా రావు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, నాయకులు జె.చంద్రశేఖర్, ఎం.వినోద, అశోక్ రెడ్డి, భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు అపూర్వ స్పందన



ఆడిటోరియంలో ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న నాగేశ్వర్‌రావు తదితరులు

ఉప్పల్: ఉప్పల్ శిల్పారామం ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు అపూర్వ స్పందన లభించింది. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు హాజరై ప్రారంభించారు. ఫెయిర్‌కు 50కి పైగా విద్యాసంస్థలు, వివిధ రాష్ట్రాల యూనివర్సిటీలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ విద్యా సమితి అధ్యక్షుడు తారక్ మాట్లాడుతూ ఆదివారం కూడా ఈ ఫెయిర్ ఉంటుందన్నారు. పిన్న వయస్సులో ఎవరెస్టును అధిరోహించిన మలావత్ పూర్ణ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అప్పులు చేసి బెట్టింగ్.. తీర్చలేక ఉరేసుకొని..

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

అల్వాల్: అప్పులు చేసి బెట్టింగ్‌లకు పాల్పడి ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన ఓ యువకుడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ ఇందిరానగర్‌లో నివసించే మహ్మద్ అబ్దుల్ వహీద్ (25) ఓ ప్రైవేట్ కంపెనీలో ల్యాండ్ సర్వేయర్. బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. పలు సంస్థల నుంచి లోన్‌లు తీసుకొని బెట్టింగ్ చేసి నష్టపోయాడు. అప్పులు తీర్చలేక మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీన రాత్రి ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి గడిపి తన గదిలో నిద్రపోయాడు. 25వ తేదీన ఉదయం అబ్దుల్ వహీద్‌ని నిద్రలేపడానికి తండ్రి ఎంత ప్రయత్నించినా ఉలుకూపలుకూలేదు. కిటికీలోంచి చూడగా అబ్దుల్ వహీద్ నైలాన్ వైర్‌తో ఉరేసుకున్నాడు. అక్కడ ఓ సూసైడ్ నోట్ లభించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియాలో 'సేవ్ గవర్నమెంట్ ల్యాండ్స్'



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోటో

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలంటూ పలువురు సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టారు. సేవ్ గవర్నమెంట్ ల్యాండ్స్, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చేంజ్ ద పాలిటిక్స్, నాలాలు, కాల్వలు కాపాడుకుందాం, సేవ్ బోడుప్పల్ పేరిట ఫొటో కార్డులను ప్రదర్శించారు. మల్లాపూర్ రహదారిలో ఓ కట్టడం కూల్చారని, బంగారు మైసమ్మ దేవాలయం వద్ద ప్రభుత్వభూమిలో నిర్మాణం జోలికి వెళ్లలేదని, జ్యోతినగర్ కాల్వపై షెడ్‌ను, అల్మాస్‌కుంటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టడాన్ని తొలగించలేదని పేర్కొన్నారు. అయితే కొన్ని స్థలాల్లో రాజకీయకక్ష సాధింపుల్లో భాగంగా కూల్చివేతలు చేపట్టారని బోడుప్పల్ ముదిరాజ్ మత్స్యకార సంఘం ప్రతినిధులు ఆరోపించారు.

సమాన పరిహారం ఇవ్వాలి

సీఎం సలహాదారుకు కాంగ్రెస్ నేతల వినతి



నరేందర్‌రెడ్డిని కలిసిన ఉప్పల్ భవన యజమానులు తదితరులు

ఉప్పల్: ఉప్పల్ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయిన భవన యజమానులందరికీ సమాన పరిహారం అందజేయాలని కోరుతూ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం భవన యాజమానులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఉప్పల్‌కు సంబంధించిన పలు అంశాలను ఆయనకు వివరించారు. ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కందికంటి అశోక్ కుమార్ గౌడ్, పూజల ప్రభాకర్, తిక్క ప్రకాశ్ పాల్గొన్నారు.

కార్యకర్తకు అండగా బీఆర్ఎస్



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ఇటీవల మరణించిన మల్లాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కిమిడి కుమారస్వామి కుటుంబానికి ఆ పార్టీ అండగా నిలిచింది. ఈ మేరకు ఇన్సూరెన్స్‌కు సంబంధించిన రూ.2 లక్షల చెక్కును శనివారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ



ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ గోకుల్‌నగర్‌లో నివసించే ప్రవీణ్‌గౌడ్ ఇంటిలో కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబితాఅనిల్ కిషోర్ సంఘటనాస్థలానికి చేరుకొని ఆ ఇంటిని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకొని, బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రకాష్‌గౌడ్, విజయభాస్కర్, రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో అలరించిన కూచిపూడి



మినీ శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతలను అలరించాయి. ఆశ్రిత కూచిపూడి డాన్స్ అకాడమీ గురువు ఆశ్రిత కిశోర్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేసింది. జయదేవ అష్టపది, కృష్ణకలయ సఖి, నృసింహా కవచం లాంటి పలు ప్రదర్శనలిచ్చి మెప్పించారు.

మధ్యప్రదేశ్ సీఎంకు స్వాగతం

రామంతాపూర్: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి తరఫున ప్రచారానికిగాను శనివారం నగరానికి వచ్చిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ నేత, రాష్ట్ర యాదవ సంఘం నాయకుడు వల్లపు జగన్ యాదవ్‌తోపాటు పలువురు బీజేపీ నేతలు స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. రాష్ట్రంలో యాదవ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు.